# 'పుష్' అనే చొరవ

వాకిట్లో నుంచి మా చిన్నకుర్రవాడు కాళ్ళు కొట్టుకుంటూ పరిగెత్తుతూ, లోపలకు వచ్చాడు.

"ఎవలో వచ్చాలండీ మీకోసం" అని చెప్పాడు.

వాడికీమధ్యే మూడోయేడు నిండింది....వాడికి ఊహలైతే వున్నాయి గాని మాటలు సరిగ్గారావు. నాకోసమట! యెవ్వరో వచ్చారట.

నేను నవ్వుతూ, "ఎవ్వరోయ్‌వారు?" అని అడిగాను. పోయేవాణ్ణి పట్టుకొని.

"అప్పుడు లాలా, ఆలు" అన్నాడు. అని విడిపించుకుని రివ్వున మళ్ళీ బయటకుపరిగెత్తాడు....యెప్పుడో వచ్చారట! వారట వచ్చింది?"– నేను, నాలోనేను నవ్వుకుంటూ, ఆవ్యక్తి యెవ్వరో చూద్దామని కదిలాను.

నేను వెళ్ళేటప్పటికి ముందు గదిలో కూర్చొని, బల్లమీదవున్న వేదాంత గ్రంథాలుతిరగవేస్తున్నారు– చలమయ్యగారు....

చలమయ్యగారు నాకు చిరకాల పరిచితులు. దేశభక్తులు. అంటే దేశభక్తి అధికారంలోకి వచ్చిం తర్వాత పుట్టుకు వచ్చిన దేశభక్తుడుకాదు అనాది పదార్థం. కాస్త వేదాంతికూడా. ఇటీవలే ఎం. ఎల్. ఎ. అయ్యారు మంత్రిపదవి కొద్దిలో తప్పిపోయిందని పుకారు.

"ఎప్పుడు దయచేశారు?" అన్నాను.

"ఇప్పుడే" అన్నారు వారు.

"ఈ ఊరు!" అన్నాను.

"ఇదిగో ఈ ఎసెంబ్లీ వొకటి వుందిగదండీ, ఆ మీటింగులకు వచ్చాను.... మిమ్మల్ని చూట్టం ఇప్పటికి పడింది" అన్నాడు.

"తెలిస్తే మీ బసకు నేనే వచ్చేవాణ్ణి" అన్నాను.

"ఇంకా నయం" అన్నారు వారు.

"మీరు మంత్రి అవుతారని ఆశపడ్డాం" అన్నాను.

వారు నా మొహంలోకి చూశారు. తల అడ్డంగా తిప్పుతూ "కాను" అన్నారు.

"ఎంతమంది కావటంలేదు!" అన్నాను నేను.

"కాదగిన ముఖ్యలక్షణం నాకు వొకటిలేదు" అన్నారు వారు.

"ఏమిటది?" అడిగాను నేను.

"పుష్" అన్నారు వారు. "ఎన్ని ఉండి ఏం లాభం? 'పుష్' లేదు."

నాకు వారు ఎవ్వర్నో హాస్యం చేస్తున్నారనిపించింది. కాని వారి మొహంలో ఆ లక్షణా లేమీ కనిపించలేదు. చాలా "సీరియస్‌గా" చెప్పారు.

వారికి కాయలంటే ఇష్టం. నేను కాయలు తెప్పించాను. వారు, "ఎందు కివి?" అన్నారు. "ఏదోలెండి." అన్నాను. వారు "సరే" అన్నారు. నెమ్మదిగా మళ్ళీ మాటల్లోకి దిగాం. ఏవేవో మాట్లాడుకున్నాం. చివరికి వారు, "నిన్న జరిగిన అధికోత్పత్తి మహాసభకు తమరు కూడా వస్తారనుకున్నాను" అన్నారు.

"మీటింగులకు తప్పుకుతిరిగే స్వభావం నాది." అన్నాను.

వారు నన్ను ఎగాదిగా చూశారు. చెప్పారు. "ఆ మీటింగులో నాకొక చిత్రమైన అనుభవం కలిగింది....మీరు మా తోలేటి బభ్రువాహనాన్ని ఎరుగుదురా?" అని అడిగారు.

నేను ఆలోచించాను. "ఎరుగను." అన్నాను ".వినిఫుండలేదు."

"మీ రొక్కరు కనిపిస్తున్నారు. వాడిని ఎరగనివారూ, వినివుండని వారూ." అన్నారు వారు. "వాడిది మావూరే. మేము దేశ స్వాతంత్ర్యం కోసం జైళ్ళకు వెళ్ళేరోజుల్లో వాడు ఆడుతూ బోగం కొంపలు పట్టుకు తిరుగుతుండేవాడు. ఇప్పుడు వాడే మాకు నాయకుడయ్యాడు. మాకే పనులు కావలసినా వాడిద్వారా చేయించుకోవటం కంటే గత్యంతరం కన పట్టంలేదు." అని నిట్టూర్చారు.

"యెలా వచ్చాడు ఆ స్థితికి?" నేను అడిగాను.

"పనులు చేయించి." అన్నారు వారు. "వాడుచేయించి పెట్టని పను లేమి వుంటై. ఉద్యోగాలూ, పర్మిట్లు అడిగే వాళ్ళుంటే మంత్రిపదవి అన్నీ యిప్పిస్తాడు. ఈనమ్మకంతో నెమ్మదిగా వాడికొక ముఠా తయారైంది. అది పెరిగి పెద్దదైంది...."

ఇవన్నీ వింటుంటే నాకు అనుమానం వొచ్చింది. "పేరు ఏమన్నారు?" అని అడిగాను. వారు చెప్పారు. "తోలేటి బభ్రువాహనం" వొక్కసారి వింటే మరిచే పేరు కాదు. నేను విని వుండను. కాని వెంటనే తట్టింది. "అంటే వాహన్ టి.బి.కాదుగదా?"

"వాడే!" అన్నారు వారు.....

"అయితే నేను యెరుగుదును." అన్నాను నేను. "నేను సినిమాల్లో డైరెక్టరుగా వున్నప్పుడు తరుచు తగులుతుండేవాడు...."

"వాడే!!"

"ఒక మంచిపిల్ల ఉందనేవాడు. వేషం ఇవ్వమనేవాడు. ఇవ్వకపోతే ప్రచారం మొదలు పెట్టేవాడు."

"ఆఁ వాడే! వాడే!!" అన్నారు వారు.

"వా డేం చేశాడు?"

"అదే చెప్పుతున్నా...." కాసేపు ఆలోచించి, "ఇప్పుడు మీతో యేం చెపుతున్నాను?" అని అడిగారు.

నేను చెప్పాను.... "అదే, నిన్న జరిగిన అధికోత్పత్తి మహాజన సభ సంగతి."

"ఆఁ ఆవును." అన్నారు వారు "నేను యెక్కడికీ ముందుకు తోసుకు వెళ్ళలేను. నెమ్మదిగా వెళ్ళి వెనకకూర్చున్నాను. నేను ముందువచ్చి కూర్చునేవరకూ వూరుకోలేదు. ఆ ఉన్నతోద్యోగుల్లో కూచుంటే బాగానే వుంది. ఒక్కక్షణం నేను ఎం. ఎల్. ఎ. ని అయినందుకు సంతోషించాను.... కాని ఆ సంతోషం ఒక్కక్షణమే...."

నేను అడిగాను.... "ఏం? ఏం జరిగింది?"

"జరిగింది." అన్నారు వారు. అని ఊరుకున్నారు.

నేను మళ్ళీ అడిగాను. "ఏం జరిగింది?" వారు చెప్పారు.

"కన్నెత్తి ముందుకు చూద్దునుగదా నా ముందు వరుసలో,మంత్రులు కూర్చునే వరుసలో, ప్రారంభం చెయ్యటానికి వచ్చిన కేంద్రమంత్రి ప్రక్కన మాతోలేటి బభ్రువాహనం కూర్చొని వున్నాడు."

"వాహన్ టి బి?"

"అవును. వాహన్ టి. బి. యే." అన్నారు వారు.

"వా డెలా వచ్చాడు అంతముందుకి?" అని అడిగాను.

"తెలిసే వరకూ నేనూ మీకుమల్లేనే ఆశ్చర్యపడ్డాను" అన్నారు వారు.

"ఏం తెలిసింది?" అడిగాను నేను.

వారు చెప్పారు.... కేంద్రమంత్రి ప్రారంభం చెయ్యటానికి వస్తున్నాడని వాహన్ టి. బి. ముందే ఢిల్లీ వెళ్ళి వారితో పరిచయం చేసు

కున్నాడట. ఇక్కడ యీ మీటింగు ఏర్పాట్లన్నీ తానే చేస్తున్నట్లు నటించాడట. అక్కడనుంచి ఆయనతోనే కలిసి వచ్చాడట, ఆయనతో కలిసిరావటంవల్ల ఆయనతోపాటు అతనికీ యిక్కడివాళ్ళు మర్యాదలు చెయ్యక తప్పలేదు.

"చూశారా యిలా నడిచిపోతూ వుంది. ప్రపంచం" అన్నారు వారు "ఈ పరిస్థితుల్లో మంచితనం ఈ ప్రపంచంలో యెన్నాళ్ళు బ్రతుకుతుంది?" అని అడిగారు. "మంచిగాఎందుకు వుండాలి?" అని అడిగాను.

వారేదో ఆలోచిస్తూకూర్చున్నారువారినిచూస్తూంటే నాకునిజంగాకష్టం వేసింది— వారింకా అధికోత్సత్తి మహాసభలో జరిగిన సంగతి గురించే ఆలోచిస్తున్నారు. సందేహంలేదు. వారి మనసు మరల్చాలనే ఉద్దేశంతో "ఇంకా వొక వారం రోజులైనా వుంటారనుకుంటాను" అన్నాను.

వారు దృష్టిని నా మీదకు ప్రసరించి ఒక్క క్షణం శూన్యంగా చూచి చివ్వరికి "చెప్పలేను" అన్నారు. ఇంతలో మా చిన్నకుర్రవాడు. వొక ప్లేట్లో బత్తాయి తొనలు తెచ్చి వారి ముందు వుంచాడు. వారు వాణ్ని పట్టుకొని "ఏం చదువుతున్నావ్?" అని అడిగారు.

"పుత్తకాలు" అన్నాడు వాడు వెంటనే విడిపించుకొని రివ్వున లోపలకు పరిగెత్తాడు. 'ఏం చదువుతున్నావ్?' అని వారు "ఏక్లాసు చదువుతున్నావు?" అనే ధోరణిలో అడిగారు. వాడు 'పుత్తకాలు' అనేటప్పటికి విరగబడి నవ్వారు. దాంతో వారి భారం కొంత తగ్గినట్లుంది.... నవ్వుతూ, "ఇంతకు ముందు నేను మంత్రి నవటాన్నిగూర్చి తమరేదో చెప్పారు" అన్నారు.

"అవును."

"ఒకరి సంగతి యెందుకు? నేనూ అనుకున్నాను.కాని దానికీ వాడే అడ్డు తగిలాడు"అన్నారు వారు.

"ఎవరు" వాడేనేమో అని నాకు ఆశ్చర్యం వేసి అడిగాను.

"వాడే!" అని చెప్పారు. "వాహన్. టి. బి."

"ఏం చేశాడు?" అని అడిగాను.

వారు చెప్పారు.... వారి జిల్లాలో చెవులపాటి కుటుంబయ్య అని, మరొక ఎం. ఎల్. ఏ. వున్నాడట. మంత్రి పదవికి ఆయన్ని రేపాడట వాహన్. టి. బి. "ఇస్తే కుటుంబయ్యకు– లేకపోతే మా జిల్లాకే వద్దు" అనే వినాదం లేవదీశాడట!! చివ్వరికి మంత్రి పదవి ఎవ్వరికీ రాలేదట.

"మంత్రి పదవైతే రాలేదుగాని, వాడు నామీదచేసిన ప్రచారం మాత్రం ప్రజల మనస్సులో నిలబడి పోయింది." అన్నారు వారు ముగింపుగా.

"ఏమిటది?" – నేను అడిగాను....

"చలమయ్యగారికి ఎన్ని వుండి ఏం లాభం. "పుష్" లేదు, అనే మాట," అని జవాబు చెప్పారు. చెప్పి "పుష్" అంటే ఏదో వొక వుపాయంతో ఎదురువచ్చిన వాళ్ళందర్నీ పడదోసుకొని ముందుకు వెళ్ళటమేగా! అంటే ఇప్పుడు బభ్రువాహన్ చేస్తున్నపనేగా?" అని అడిగావు.

నేను జవాబు చెప్పలేకపోయాను.

*  *  *  *